క్లుప్తంగా

ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు



తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, త్యాగానికి ప్రతీకగా క్రీస్తు లోక రక్షణ కోసం శిలువ మరణం అనంతరం పునరుద్దానుడై లేచిన సందర్భంగా క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకునేది ఈస్టర్ శుభదినం అన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపి తోటి వారి పట్ల, ప్రేమ, వాత్సల్యం , సమానత్వంతో కలిసి మెలిసి జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

విజయదుర్గా ఆలయంలో పూర్ణాహుతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజయ దుర్గా ఆలయం వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అర్చకులు వి.రాజేంద్రశర్మ అభిషేకాలు నిర్వహించి పలురకాల పుష్పాలతో విశేష అలంకారం చేశారు. యాగశాలలో చండీ హోమం, రుద్రహోమాలను వేదపండితులు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

లక్ష్మీనారసింహుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామశివారులోని శ్రీలక్ష్మీనారసింహస్వామివారికి చైత్రబహుళ స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, వెంకటరమణమ్మలు పర్యవేక్షించారు.

పెనుమాకలో రక్తదాన శిబిరం

తాడేపల్లిరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా శనివారం ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని పెనుమాకలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఐశ్వర్య ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి రక్తం అందించవచ్చని అన్నారు. రక్తదానంపై యువత అపోహలు విడనాడాలని అన్నారు. ఆరోగ్యవంతంగా ఉండే వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, దీని వల్ల కొత్త రక్తం ఏర్పడి ఉత్సాహంగా ఉంటారని అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన చైతన్య అంబేద్కర్ యువతను అభినందించారు. వీరి వద్ద నుంచి 20 యూనిట్ల రక్తం సేకరించామని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి, నుదురుపాడు పీహెచ్‌సీ ఇన్‌చార్జి సాయి సిద్ధార్థ రెడ్డి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ఎండలో తిరగకూడదన్నారు. తప్పనిసరి అయితే తలకు గుడ్డను ధరించి వెళ్లాలని సూచించారు. మంచినీరు తాగాలని వడదెబ్బ తగిలిందని భావించినప్పుడు ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల వద్ద, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉంటాయని దానిని తీసుకోవాలని సూచించారు. రక్తహీనత లేకుండా ఐరన్‌మాత్రలు వైద్యులు సూచించిన విధంగా వేసుకోవాలన్నారు. అనంతరం సాధారణ, షుగర్ వ్యాధిగ్రస్తులు 135మందికి రక్తపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ గోవిందయ్య, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం ఆంతోనిరాణి, ఆశాకార్యకర్తలు సుజాత, పద్మ, శాంతకుమారి, శాంతరాణి, జోజమ్మలు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి వద్ద నుంచి ముగ్గురోడ్డు సెంటర్ వరకు శనివారం వీధిలైట్లు ఏర్పాటుచేశారు. తాడేపల్లి పరిధిలోని డివైడర్ మధ్యలో ఉన్న వీధిలైట్లు కొంత కాలంగా సరిగా వెలగడం లేదు. స్థానికంగా ఉన్నవారు సచివాలయంలో ఫిర్యాదు చేయడంతో 30 లైట్లను కార్పొరేషన్ ఎలక్ట్రికల్ సిబ్బంది మార్చి సాయంత్రానికి వీధిలైట్లను వెలిగించారు.

సామాజిక కార్యకర్త శేషమ్మకు సన్మానం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో భారతీయ జనతాపార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా నిర్మాణ దివస్ కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కాకుమాను భాగ్యేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘ సేవకురాలు, సామాజిక కార్యకర్త మున్నంగి శేషమ్మను సత్కరించామని, ఈమె ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పలుచోట్ల భజన బృందాలను తయారు చేస్తూ, కోలాటాలను నేర్పుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు టంకశాల ఈశ్వర్‌నాయుడు, చేకూరి శ్రీనివాసరావు, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతక్కి రోడ్లకు మహర్దశ

- రూ ఆరు కోట్లతో మూడు రోడ్లు పూర్తిచేసిన అధికారులు
- ఇప్పటికే డొంక రోడ్లు అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, స్థానికులు



పూర్తయిన ఎస్సీ కాలనీ రోడ్డు

నూతక్కి(మంగళగిరి): నగర పరిధిలోని నూతక్కి రోడ్లకు మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో నూతక్కిలోని ప్రధాన రోడ్లు, డ్రైయిన్‌లు నిర్మాణాలు పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నూతక్కి పొలాల్లోని డొంక రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి పరచడంతో రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు, పంటలను ఇళ్లకు తీసుకు వచ్చేందుకు ఇబ్బందులు తొలగడంతో ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. నూతక్కిలో రూ.6 కోట్లతో చేపట్టిన ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నూతక్కి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు రూ.2.20 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైయిన్ నిర్మాణం పూర్తయ్యింది. సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు రూ.1.15 కోట్లతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణంతోపాటు రెండు వైపులా డ్రైయిన్‌ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. బాప్టిస్ట్ చర్చి బీటీ రోడ్డు నుంచి రేపల్లె కాలువ(పేరుకలపూడి డొంక వరకు) రూ.20.50 కోట్లతో చేపట్టిన 2.20 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. నగర పాలక సంస్థలో విలీనం కావడంతో రోడ్లు, డ్రైయిన్‌లు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోవడంతో మౌలిక వసతులు నగర స్థాయిలో మారుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగాయి



ఎన్నో సంవత్సరాలుగా గ్రామంలోని ప్రధాన రోడ్లు గోతులమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వృద్ధులు, పిల్లలు రోడ్లపై తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే ఆర్కే కృషితో గ్రామంలోని ప్రధాన రోడ్లు, డ్రైయిన్‌ల నిర్మాణం పూర్తి చేసుకోవడం అభినందనీయం.

నూతక్కి రామచంద్రరావు

గ్రామ రూపురేఖలు మారాయి



గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్లను విస్తరించి సీసీ రోడ్లతోపాటు డ్రైయిన్‌లు నిర్మించడంతో గ్రామ రూపురేఖలు మారాయి. ఎమ్మెల్యే ఆర్కే కృషితో ఇప్పటికే పొలాల్లోకి వెళ్లే డొంక రోడ్లన్నీ గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేయడంతో రైతుల కష్టాలు తీరాయి. గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఆర్కే చేస్తున్న కృషి అభినందనీయం.

అన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలి

నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అధికారి

మంగళగిరి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్ అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన గర్భిణులు, చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారంతోపాటు రక్తహీనతతో బాధపడే వారికి ఐరన్ ట్యాబెట్లు, సిరప్‌లను క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అదే ప్రాంతంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకునే విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. 30 సంవత్సరాలు దాటిన వారికి బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వి రాజేష్, ఆరోగ్య విస్తరణాధికారి కె లక్ష్మీమనోహర్‌ల తోపాటు పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచుల సంక్షేమ సంఘం సమావేశం



జాస్తి వీరాంజనేయులను సన్మానిస్తున్న పాపారావు, సర్పంచులు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి నిధులు లేక సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల్లో జాప్యం జరుగుతుందని, వెంటనే విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ జాస్తి వీరాంజనేయులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరుదల సాంబశివరావు, సర్పంచులు ఉయ్యూరు అప్పిరెడ్డి, తోకల సరోజిని, మబ్బు శిరీష, డి. సూర్య ప్రకాశరావు, నల్లిపోయిన శ్రీనివాసరావు, ఎస్. లలిత కుమారి పాల్గొన్నారు.

ఆదిమవాసులపై వైమానిక దాడులు నిలిపివేయాలి



సభలో మాట్లాడుతున్న చిలుకా చంద్రశేఖర్

పాత గుంటూరు: దండ కారణ్యం ప్రాంతంలో ఆదిమవాసులపై కేంద్ర ప్రభుత్వం వైమానిక బాంబు దాడుల్ని తక్షణం నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో శనివారం ఆదిమవాసులపై వైమానిక దాడులు, నిజ నిర్ధారణ, కర్తవ్యాలు అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. పౌర హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వి.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దండకారణ్యం ప్రాంతంలో విలువైన ఖనిజాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదిమవాసుల్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక ఆదివాసి, గిరిజన రైతాంగంపై డ్రోన్లు వైమానిక దాడుల్ని తక్షణం విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దిశగా అన్ని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు, పౌర సమాజం స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు, విరసం నాయకులు పాణి, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు అంజమ్మ, ప్రజా కళామండలి నాయకులు జె.కోటి పాల్గొన్నారు.

10న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి రాక



సమావేశంలో మాట్లాడుతున్న మస్తానయ్య

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఈ నెల 10న విచ్చేస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య తెలిపారు. ఆలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10న సాయంత్రం విశేష శోభాయాత్రగా స్వామికి పూర్ణ కుంభస్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. 13న సాయంత్రం వరకు స్వామివారు ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజు ఆరు గంటల పాటు మహా త్రిపుర సుందరీ దేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పూజలు, చండీ యాగం, అనుగ్రహ భాషణం జరుగుతాయని తెలిపారు. 11న సాయంత్రం డాక్టర్ డీ.ఎస్. దీక్షిత్ రచించిన శ్రీ వేంకటాచల మహత్మ్యం గ్రంథాన్ని స్వామి ఆవిష్కరిస్తారని మస్తానయ్య చెప్పారు. సమావేశంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, పి.ప్రభాకరరావు, కోశాధికారి లంక సూర్యనారాయణ, ఆవుల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై అవగాహన అవసరం

గుంటూరుమెడికల్: చర్మ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ హనుమానాయక్, డీఎస్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు. గుంటూరు మెడికల్ కళాశాలలో శనివారం ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎస్‌ఆర్‌లు, పీజీలు, హౌస్ సర్జన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. చర్మ వ్యాధుల్ని ప్రాథమిక దశలో గుర్తించే విధానం, చికిత్స గురించి వివరించారు. గుంటూరు జీజీహెచ్‌లో చర్మ సంబంధిత సమస్యలకు అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. వ్యాధుల నివారణకు స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్స్ వాడటం వల్ల చర్మంపై అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ శుభాకాంక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆదివారం ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈస్టర్ పండుగను భగవంతుని రాకకు గుర్తుగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

దయామయుడు ఏసుక్రీస్తు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఫిరంగిపురం: దయామయుడు ఏసుక్రీస్తు అని పాస్టర్ ఎస్.మోహన్‌రావు అన్నారు. ఫిరంగిపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ శనివారం నిర్వహించారు. శిలువ వేయబడిన క్రీస్తు మరలా మూడోరోజున తిరిగి ప్రజలను, పాపులను రక్షించుటకు తిరిగి వచ్చారని పేర్కొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

75 మందికి కంటి పరీక్షలు



తాడేపల్లిరూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తాడేపల్లి ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు పారా మెడికల్ ఆప్తాలమిక్ అధికారి వి.వి.కర్ణ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు వైద్య శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 15 మందికి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించామని, కంటి ఆపరేషన్ నిమిత్తం తొమ్మిది మందిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని అన్నారు. ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మేడికొండూరు: మండల పరిధిలోని పేకాట స్థావరాలపై మేడికొండూరు పోలీసులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పేరేచర్ల లక్ష్మీనరసింహకాలనీలో రహస్యంగా ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని సీఐ వాసుకి వచ్చిన సమాచారం మేరకు కానిస్టేబుల్స్ డేవిడ్, నజీర్‌లతో కలిసి పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7210 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జనగుండ్ల ప్రాంతం నుంచి నెహ్రూనగర్‌కు ముద్రబోయిన వెంకటేశ్వరరావు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. నెహ్రూనగర్ రైల్వే గేటు వద్ద 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

స్వల్ప ఘర్షణ నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌పేటలోని నివాసం ఉండే అఫ్రోజ్‌పై స్వల్ప ఘర్షణ నేపథ్యంలో సజ్జత్ బాషా, ఇనాయతుల్లా అతని కుమారుడు కలసి దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

విద్యార్థినిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని కొండెపు ఈశ్వర్ నిత్యం వెంటపడి వేధిస్తున్నాడు. ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రత్నాల చెరువులో జగనన్నే మా భవిష్యత్



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, మండల సచివాలయాల కన్వీనర్ అబ్బాస్

మంగళగిరి: నగరంలోని రత్నాల చెరువులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ అందజేసిన ప్రశ్నావళిని వివరించి సర్వే నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఏ విధంగా పథకాలు అందాయో, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ఏ విధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయో ప్రజలకు వివరించారు. స్పందించిన ప్రజలు ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు సంతృప్తికరంగా ఉన్నాయని, మరలా ఈ ప్రభుత్వమే రావాలని, జగనన్నే మా భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఇంటింటికి తిరిగి పథకాలు వివరించడంతోపాటు పార్టీ సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేసి ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వ్యాసం అజయ్‌కుమార్, పార్టీ సచివాలయ కన్వీనర్లు బట్టు రవి, కె దుర్గ, నక్కా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజల ఆర్థిక అభివృద్ధి పెరిగిందని సచివాలయ మండల కన్వీనర్ షేక్ అబ్బాస్ పేర్కొన్నారు. మేడికొండూరు మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమాన్ని అబ్బాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య హాజరై ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి స్టిక్కర్లను అంటించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ మాట ఇస్తే మడమ తిప్పే వ్యక్తి కాదని అన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోటా బాజి, సచివాలయ కన్వీనర్ రాజేంద్రప్రసాద్, వలంటీర్ గంగుల మేరి, జ్యోత్స్న, గృహసారథి జవహర్, ఎంపీటీసీ సభ్యుడు కొలకలూరి సామ్రాజ్యం, బుర్రా సుబ్బారెడ్డి, జయరావు, జానీబాషా, ఉడతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు ప్రేమతత్వాన్ని అనుసరించాలి

నగరంలో రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ



రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవ సోదరులు

మంగళగిరి: మత సామరస్యానికి ప్రతీకగా రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ నిర్వహించామని పలువురు వక్తలు, పాస్టర్లు పేర్కొన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అంబేద్కర్ విగ్రహ సెంటర్ నుంచి రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి శాంతి పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. పలువురు వక్తలు, పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు ప్రేమతత్వాన్ని అనుసరించి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. గుడ్‌ఫ్రైడే సాక్షిగా ప్రజలంతా శాంతికి పునరంకితం కావాలని కోరారు. వివిధ కూడళ్లలో పాస్టర్లు, పుర ప్రముఖులు ర్యాలీకి స్వాగతం పలికి సందేశాలను అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి తిమోతి, ఫాదర్లు జయరాజు, పూదోటి చిన్నయ్య, బేతు వివేక్, కెకె రవికుమార్, ఏపీఎస్ మణి, ఆర్‌వై దాసు, దాసిపాల్, ఐ జోసెఫ్, వి శ్యాంసన్, జి.మృత్యుంజయుడు, కె.కరుణానిధి, కె.భూషణం, పి.అరుణ్ కుమార్ పాల్గొనగా క్రైస్తవ సోదరులు, చిన్నారులు, యువకులు శ్వేతవర్ణ రన్ ఫర్ జీసస్ పతకాలు చేతబట్టి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో...

నగరంలోని పార్కురోడ్డు ఇమ్మానియేలు చర్చి నుంచి మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ బొంతపురి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి ర్యాలీ నిర్వహించి పలువురు పాస్టర్లు శాంతి సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు బేతాళ సాల్మన్‌రాజు, దున్నా నాగయ్య, కూర్మ ప్రశాంతరాజు, మాతంగి భాస్కరరావు, గుర్రాల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆక్రమణలను ఇప్పటికే అధికారులు తొలగించారు. ఇప్పటంలో సురక్షిత నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ గతంలో ఉన్న పాతరోడ్‌కు మార్జిన్ వెంబడి ఉండడంతో ఆ పైపులైన్‌ను మార్చాలని ఇంజినీరింగ్ సిబ్బంది కార్పొరేషన్ అధికారులకు సూచించారు. పైపులైను పనులు పరిశీలించేందుకు డీఈ కృష్ణారెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటంలో రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి రెండువైపులా డ్రెయిన్‌లు నిర్మించనున్నామని తెలిపారు. పైపులైన్లు కూడా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ మండల యువజన నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం ప్రాతూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. అవగాహన కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. శైలజలు అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సరుకుల పంపిణీ



నెహ్రూనగర్: నగరంలో రాబిన్ హుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ముత్యాలరెడ్డి నగర్‌లోని 1వ లైనులో శనివారం రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ ప్రతినిధులు పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ రాబిన్ హుడ్ ఆర్మీ సేవా సంస్థ జిల్లావ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు. ముఖ్యంగా వృద్ధ, అనాథ ఆశ్రమాలకు నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.